సాక్షి
కర్నూలు
మంగళవారం । 16 । జూలై । 2024



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. ఆలయ మాడవీధుల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు.



రూ.13.90లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ మల్కాజ్‌గిరికి చెందిన స్వయంపాకుల లక్ష్మీనారాయణ కుటుంబసమేతంగా రూ.13.90 లక్షల విరాళాన్ని అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,608.5
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 34
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 16,142
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 211

న్యూస్‌రీల్

ఆలూరు ఆస్పత్రిలో మందుల కొరత



ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత ఏర్పడింది. సీజనల్ వ్యాధులతో ప్రతి రోజు 200 నుంచి 250 వరకు రోగులు వస్తున్నారు. అత్యవసర మందులు లేక తప్పని పరిస్థితిలో రోగులు బయట ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొని తెచ్చుకుంటున్నారు. చాలా మంది విరేచనాలు, వాంతులతో ఆస్పత్రికి వస్తుండగా..వీరికి అత్యవసరంగా ఇవ్వాల్సిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేవు. అలాగే ప్యారాసిటమాల్ ట్యాబ్లెట్లు, ప్యాంటాప్, డైక్లో ఇంజక్షన్, ట్యాబ్లెట్లు సైతం లేవు. గాయాలను శుభ్రం చేసేందుకు వాడే హైడ్రోజన్ పెరాక్సైడ్, టించర్ కొరత ఏర్పడటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గత వారం నుంచి ఈ పరిస్థితి ఉందని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని డాక్టర్ వాహిద్ తెలిపారు. మందుల కోసం ఇండెంట్ పంపించామని, రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

పంటల సాగు 32.59 శాతమే

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ నెల 15 నాటికి 32.59 శాతం పంటలు మాత్రమే సాగయ్యాయి. సాధారణ సాగు 4.19 లక్షల హెక్టార్లు ఉండగా.. ఈ నెల 8 నాటికి సాగు విస్తీర్ణం 1,21,995 హెక్టార్లు ఉండగా.. ప్రస్తుతం 1,36,626 హెక్టార్లకు చేరుకుంది. కేవలం వారం రోజుల వ్యవధిలో 14,631 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. వర్షాలు లేకపోవడం, పడుతున్న వానలు కూడా తేలికపాటికే పరిమితం కావడం వల్ల సాగులో పురోగతి కరువైంది. ఒక్క పత్తి మాత్రమే 86,146 హెక్టార్లలో సాగు కావడం విశేషం. మిగిలిన పంటలన్నీ కలిపి 50,480 హెక్టార్లలో సాగయినట్లు స్పష్టమవుతోంది. వేరుశనగ 20,964, కంది 13,184 ఆముదం 3,211, మిరప 1,272, ఉల్లి 3,220, సజ్జ 3,087, మొక్కజొన్న 2,197, కొర్ర 1,768, టమాట 796 హెక్టార్ల ప్రకారం పంటలు సాగయ్యాయి.

18 నుంచి కేంద్ర బృందం పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): జల్‌శక్తి అభియాన్ పనులను పరిశీలించేందుకు ఈ నెల 18 నుంచి 20 వరకు జిల్లాలో కేంద్ర బృందం పర్యటించనుంది. కేంద్ర బృందానికి నోడల్ అధికారిగా ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రిన్స్‌పల్ కమిషనర్ చిత్తరంజన్‌దాస్, టెక్నికల్ ఆఫీసర్‌గా సీ.టెక్ సైంటిస్ట్ బిజయ్‌కేతన్ మోహితా వ్యవహరిస్తారు. ఈ బృందం ఈ నెల 17వ తేదీ రాత్రి కర్నూలుకు చేరుకుంటుంది. 18 నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనుంది.

దళితులపై పెరిగిపోతున్న దాడులు



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): టీడీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోని మండలం నాగనాథహళ్లికి చెందిన దళిత మహిళ గుండమ్మను పొలంలో విషయంలో ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపడం అగ్రవర్ణాల అహంకారానికి నిదర్శనమన్నారు. జూన్ 17న వెల్దుర్తి మండలం రత్నపల్లికి చెందిన దళిత మహిళలపై కొందరు విచక్షణ రహితంగా దాడి చేసినా ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఆదోని పట్టణంలోని వసంత నగర్‌లో మొహర్రం సందర్భంగా డప్పుకొట్టే విషయంలో కళాకారుడు లక్ష్మన్నపై దాడి చేస్తే కేసు నమోదు చేశారు తప్ప నిందితులను అరెస్టు చేయలేదన్నారు. ఎమ్మిగనూరు మండలం కోటేకల్‌లోనూ డప్పు వాయించడంలో అగ్రకులాల వారు దళితులపై దాడి చేశారన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరులో దళితుడు అరుగుపై కూర్చున్నారన్న కసితో కాగే నూనెను పోసి తీవ్రంగా గాయపర్చారన్నారు. ప్రభుత్వం స్పందించి దళితులపై దాడులను అరికట్టాలన్నారు. ధర్నాలో నాయకులు రోషన్న, జె.వెంకటేశ్వర్లు, కె.రాజ్‌కుమార్, ఏసన్న, ఈశ్వరయ్య, ప్రకాశం, బీదన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

యువకలలం నిధి!

అందని ద్రాక్షగా నిరుద్యోగ భృతి

- రూ.3వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వ హామీ
- ఇప్పటికే ఉచిత ఇసుక, తల్లికి వందనం విషయంలో దగా
- కోచింగ్ సెంటర్లకు బారులు తీరుతున్న నిరుద్యోగులు
- అతీగతీ లేని 20లక్షల ఉద్యోగాలు
- జిల్లాలో 4.66,348 లక్షలకు పైగా నిరుద్యోగులు

ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు 20లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికి 'యువగళం' కింద నెలకు రూ.3వేలు ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి జిల్లాకు వచ్చిన ప్రతీ మీటింగ్‌లోనూ ఈ విషయాన్ని ప్రచారం చేశారు. దీంతో అధికశాతం నిరుద్యోగులు ఆ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.



సాక్షి ప్రతినిధి కర్నూలు: టీడీపీ, జనసేన, బీజేపీ 'కూటమి' ప్రభుత్వం అధికారం చేపట్టి నెల దాటింది. ఆచరణ సాధ్యంకాని హామీలతో ఈ కూటమి అధికారాన్ని దక్కించుకుంది. ఈ నెలలో ఒక హామీ అమలు చేస్తే, రెండు హామీలను తుంగలో తొక్కారు. 'ఉచిత ఇసుక'కు ధర నిర్ణయించి వ్యాపారం చేస్తున్నారు. 'తల్లికి వందనం' కింద ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ప్రతీ తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తామని జీఓ 29 జారీ చేశారు. ఈ జీఓను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ (అఖిల భారత యువజన సమాఖ్య) జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ కుటుంబానికి, ప్రతీ తల్లికి ఇసుక ఉచితంగా ఇవ్వడం లేదని, 'తల్లికి వందనం' పేరుతో ప్రతీ తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తున్నారని స్పష్టమైన అవగాహన వచ్చింది. దీంతో 'కూటమి' తక్కిన హామీలపై సర్వత్రా చర్చ నడుస్తోంది. ఇందులో ప్రధానమైంది 'యువగళం'. అత్యధిక సంఖ్యలో లబ్ధిదారులు ఉన్న పథకం ఇది. దీంతోనే నిరుద్యోగులు దీని అమలుపై గళం విప్పుతున్నారు.

జిల్లాలో నిరుద్యోగుల వాదన ఇదీ..

టీడీపీ అధికారంలోకి వస్తే ఏప్రిల్, మే, జూన్ కలిపి జూలైలో పింఛన్ రూ.7వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. దాన్ని అమలు చేశారు. ఇప్పుడు జూలై ఒకటి నుంచి నిరుద్యోగ భృతి చెల్లించాలి. విధివిధానాలు ఖరారు చేసి, పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలి. పింఛన్ తరహాలోనే జూలై నుంచి పరిగణనలోకి తీసుకుని బకాయిలతో సహా చెల్లించాలి.

నాటి మోసంతో.. నేటి అమలుపై అనుమానాలు

2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు పాదయాత్ర చేసి ప్రతీ నిరుద్యోగికి రూ.2వేలు భృతి ఇస్తారని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అప్పట్లో ఇంటికో ఉద్యోగం కూడా ఇస్తామన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదు. నిరుద్యోగభృతిని అమలు చేయలేకపోయారు. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు 2018 అక్టోబర్ నుంచి కొంతమందికి మాత్రం రూ.వెయ్యి చొప్పున భృతి ఇచ్చారు. దీంతో ఈ దఫా భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ ఇలా ప్రతీ చదువుకు అర్హతను బట్టి ఉద్యోగం వస్తుంది. చంద్రబాబు హామీ అమలులో విద్యార్హతలను కొలమానంగా ప్రకటించలేదు. కాబట్టి వీరంతా 'భృతి'పై ఆశలు పెట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 22,72,764 లక్షల జనాభా ఉంది. 2024కు కనీసం 10శాతం జనాభా పెరిగి ఉంటారు. అలాగే జిల్లాలో 4,66,348 లక్షల కుటుంబాలు ఉన్నాయి. సగటున ఇంటికి ఓ నిరుద్యోగి ఉన్నారని భావించినా 4.66 లక్షల మందికి భృతి ఇవ్వాలి. ఈ లెక్కన నెలకు రూ. 139.90 కోట్లు కర్నూలు జిల్లాకే ఇవ్వాలి. దీనిపై ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడంతో ఎప్పుడు అమలు చేస్తారనే ప్రశ్న నిరుద్యోగుల నుంచి వెల్లువెత్తుతోంది.

మేనిఫెస్టోకు విశ్వసనీయత ఇచ్చిన ప్రభుత్వం

మేనిఫెస్టోకు 2019–24 మధ్యలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశ్వసనీయత తీసుకొచ్చింది. మద్యపాన నిషేధం మినహా తక్కిన హామీలను అమలు చేసి 99శాతం అమలు చేసింది. గతంలో ఏ ప్రభుత్వం ఇది చేయలేదు. దీంతో 'కూటమి' ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన అనివార్య పరిస్థితి. అయితే నెలరోజుల పాలన చూస్తే మాటలకు, చేతలకు పొంతన లేదనేది స్పష్టమవుతోంది. సచివాలయ వ్యవస్థ తెచ్చి ఉద్యోగాలు ఇస్తామని ప్రచారంలో ప్రకటించిన జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం రోజే ఎప్పటిలోగా ఉద్యోగాలు భర్తీ చేస్తారో ప్రకటన చేసి ఆచరణలో చేసి చూపించారు. దీంతో కర్నూలు జిల్లాలో 9,878 మందికి సచివాలయ కొలువులు వచ్చాయి. ఇవి కాకుండా మరో 6వేలకుపైగా ఇతర శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేశారు. దాదాపు 16వేల ఉద్యోగాలు గత ప్రభుత్వం కల్పించింది. దీంతో చంద్రబాబు ప్రభుత్వం కూడా గత మేనిఫెస్టో లాగా హామీలు అమలు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ హామీతో కోచింగ్‌కు భారీ ఖర్చు

ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. దీంతో డీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల కోసం నిరుద్యోగులు శిక్షణ కేంద్రాల బాట పడుతున్నారు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల నుంచి చాలా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రభుత్వ ప్రకటనపై ఆశ పెట్టుకున్నారు. 20లక్షల ఉద్యోగాలంటే ఏడాదికి 4లక్షల ఉద్యోగాలు.. కష్టపడి చదివితే ఏదో ఒక కొలువు వస్తుందనే ఆశతో కోచింగ్‌కు వెళుతున్నారు. రూ.30వేల నుంచి లక్ష వరకూ కోచింగ్‌కు ఖర్చు చేస్తున్నారు. మరి కొంతమంది పిల్లలు ఇతర జిల్లాలు, హైదరాబాద్, విజయవాడకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారు. ఫీజులు కాకుండా వీళ్ల హాస్టళ్ల ఖర్చులు మరింత భారం అవుతాయి. ఇలాంటి వారందరికీ మాట చెప్పినట్లు ప్రభుత్వం 'భృతి' ఇస్తే వారికి తోడ్పాటు లభిస్తుంది. రాష్ట్రంలోనే అక్షరాస్యతలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఆదోని డివిజన్. జిల్లాలో 7 నియోజకవర్గాలు ఉంటే, ఈ డివిజన్‌లో 5 ఉన్నాయి. జిల్లా సగటు అక్షరాస్యత 49.8 అయితే ఈ ప్రాంతంలో 32.4శాతం మాత్రమే ఉంది. ఇలాంటి పేద ప్రాంతం, నిరక్షరాస్యత ఉన్న ప్రాంతం నుంచి ఉద్యోగాల కోసం కోచింగ్‌కు వెళ్లే వారికి, నిరుద్యోగులకు 'భృతి' ఎంతో మేలు చేస్తుందని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు అంటున్నారు.

మండలం	కుటుంబాల సంఖ్య	2011 జనాభా లెక్కలు
కర్నూలు (అర్బన్)	73,496	3,39,529
కృష్ణగిరి	9,780	47,103
వెల్దుర్తి	13,895	63,120
పత్తికొండ	14,410	68,962
మద్దికెర (ఈస్ట్)	8,089	36,834
తుగ్గలి	12,577	59,462
సి.బెళగల్	11,858	57,167
గూడూరు	9,843	46,266
కర్నూలు (రూరల్)	15,504	67,268
కోడుమూరు	15,572	74,594
ఎమ్మిగనూరు	33,527	1,69,344
నందవరం	12,266	61,215
గోనెగండ్ల	14,578	73,873
మంత్రాలయం	12,183	61,294
కోసిగి	12,770	69,275
కౌతాళం	15,214	78,149
పెద్దకడుబూరు	10,906	56,966
ఆదోని	52,503	2,69,286
హొళగుంద	9,398	50,592
హాలహర్వి	7,582	41,123
ఆలూరు	10,278	55,834
ఆస్పరి	12,422	65,088
దేవనకొండ	14,187	71,237
చిప్పగిరి	6,569	33,400
కల్లూరు	43,910	1,96,268
ఓర్వకల్లు	13,031	58,437
మొత్తం	4,66,348	2,27,1686

నిరుద్యోగ భృతి ఏమైంది బాబు



కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల పూర్తి అయినా నిరుద్యోగ భృతి మాట ఎత్తకుండా ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న టీడీపీ గెలిచిన తరువాత దాని గురించి ఎలాంటి ప్రకటన చేయకుండా మోసం చేస్తోంది. ప్రస్తుతం ఇంటిలో ఒక నిరుద్యోగి ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వెంటనే నిరుద్యోగ భృతి మంజూరు చేయాలి. కక్ష సాధింపు చర్యలు, ఎర్రబుక్ పాలన వదిలేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. – వి.భరత్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు, బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య

హామీలను నెరవేర్చాలి



టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేయాలి. అప్పుడే చంద్ర బాబు విశ్వసనీయత తెలుస్తుంది. ఏదో ఎన్నికల ముందు హామీలను ప్రకటిద్దాం. తరువాత పక్కన పెట్టేద్దాం అంటే ప్రస్తుతం జనాలు ఊరుకునే ప్రసక్తే లేదు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తాం. లేదంటే చొక్కాపట్టుకొని నిలదీయండని కూటమిలో భాగస్వామి అయిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఆ పరిస్థితి తెచ్చుకోకుండా ఇంటికో ఉద్యగం కల్పించాలి. ఉద్యోగం కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి సక్రమంగా నెలనెలా చెల్లించాలి. – రామరాజు, నిరుద్యోగి

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



నేను డబుల్ పీజీ చేశాను. ఉద్యోగ అవకాశం లేక నిరుద్యోగిగా ఉన్నాను. టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో లక్షలాది ఉద్యోగాలు సృష్టించి ఇంటికో ఉద్యోగం కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామంటే నమ్మి ఓట్లు వేశాం. కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అయితే ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలు, మేనిఫెస్టోలోని అంశాల అమలులో ప్రభుత్వం జాప్యం చేయడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. బాబు వాగ్దానాలైతే చాలా చేశారు కానీ వాటిని అమలు చేస్తాడనే నమ్మకం సన్నగిల్లుతోంది. మరి కొన్ని రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే నిరుద్యోగులు తిరగబడే అవకాశం ఉంది. – మధుకృష్ణ, నిరుద్యోగి

యువతను మోసం చేయొద్దు



నేను రాయలసీమ యూనివర్సిటీలో పీజీ(ఎంఏ ఎకనామిక్స్) చదువుతున్నాను. యువతకు ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగభృతి ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారంలో వచ్చి నెలరోజులు దాటినా నిరుద్యోగ భృతి గురించి ఎలాంటి ప్రకటనా చేయడం లేదు. ఇందుకు సంబంధించి విధి విధానాలు కూడా ఇంకా ఖరారు చేయలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. గతంలో మాదిరిగా ఎన్నికల ముందు ఒక నెల ఇచ్చి ఊరుకుంటారేమోనని అనుమానంగా ఉంది. యువతను మోసం చేస్తే తగిన మూల్యం తప్పదు. –కె. శివ, కల్లూరు

భృతి గురించి మాట్లాడటం లేదు



మాది పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామం. నేను బీటెక్ పూర్తి చేశాను. ప్రస్తుతం కర్నూలులో స్నేహితులతో కలిసి గ్రూప్స్‌కు సిద్ధం అవుతున్నాను. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ పార్టీ నాయకులు భారీగా ప్రచారం చేశారు. కానీ ఇప్పటి వరకు దానిని ప్రారంభించలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. దాని గురించి ఏ ఒక్క ప్రజాప్రతినిధి మాట్లాడటం లేదు. దీనిని బట్టి చూస్తే గతంలో మాదిరిగానే మోసం చేస్తారా లేక వెంటనే ప్రకటిస్తారా అని వేచి చూస్తున్నాం. –కటారుకొండ సాయికుమార్

మాటల్లో కాదు.. చేతల్లో చూపుతా

- నూతన ఎస్పీ గరికపాటి బిందు మాధవ్

కర్నూలు: 'జిల్లాలో శాంతి భద్రతల సమస్యలపై అవగాహన ఉంది. క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల్లో పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రయత్నిస్తా. అయితే మాటల్లో కాకుండా చేతల్లో చూపుతా'నని నూతన జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గరికపాటి బిందు మాధవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఉన్న కృష్ణకాంత్ నెల్లూరు జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆ స్థానంలో గరికపాటి బిందు మాధవ్ నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఏఆర్ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా బిందు మాధవ్‌తో పాటు కుటుంబ సభ్యులకు పురోహితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం వ్యాస్ ఆడిటోరియంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లా ఎస్పీగా రావడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి, డీజీపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడతానన్నారు. ప్రజలకు సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, మహిళల భద్రతతో పాటు వారిపై జరిగే నేరాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక నిఘా

అన్ని ప్రభుత్వ శాఖల సహకారం, సమన్వయంతో కలసి పనిచేస్తూ ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక పోలీసు నిఘా ఉంచుతామన్నారు. సమస్యతో వచ్చిన ప్రతి ఒక్క బాధితునికి తక్షణ పరిష్కారం అందేలా కృషి చేస్తానన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసులను అప్రమత్తం చేసి నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటామని, పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. పోలీసు శాఖకు జిల్లా ప్రజలతో పాటు మీడియా కూడా తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాల కట్టడికి వినూత్నంగా ముందుకు వెళ్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

ఇదీ నేపథ్యం....

పేరు : గరికపాటి బిందు మాధవ్
పుట్టిన తేదీ : 1984, డిసెంబర్ 22
విద్యాభ్యాసం : జేఎన్‌టీయూలో ఎంసీఏ
తండ్రి : సుబ్రహ్మణ్యం (రిటైర్డ్ ఎస్‌బీఐ ఉద్యోగి)
తల్లి : కమల (లేట్) (రిటైర్డ్ ఎస్‌బీఐ ఉద్యోగి)
భార్య : అలేఖ్య
కుమారుడు : గరికపాటి మిధున మాధవ్ (ఎనిమిదిన్నరేళ్లు)
కూతురు : గరికపాటి ధ్రువ మాధవ్ (మూడున్నరేళ్లు)
స్వస్థలం : విజయవాడ
విధులు నిర్వహించిన ప్రాంతాలు : ప్రకాశం జిల్లాలో గ్రేహౌండ్స్, రంపచోడవరం ఏఎస్పీ, గుంటూరు సెబ్ జేడీ, పల్నాడు అదనపు ఎస్పీ, ఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత గ్రేహౌండ్స్, పల్నాడు ఎస్పీగా కొంత కాలం పనిచేశారు.

ప్రాణం తీసిన కలుషిత జలం!

- అతిసారంతో సుంకేశ్వరిలో నాలుగేళ్ల చిన్నారి మృతి
- వ్యాధి బారిన 50 మంది గ్రామస్తులు
- అతిసార వ్యాధిని కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలం



చిన్నారి జ్యోతి

మంత్రాలయం/ఆదోని అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా అతిసార వ్యాధి విజృంభిస్తోంది. ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో పలువురు మృత్యువాతపడుతున్నారు. తాజాగా మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసార వ్యాధి సోకి ఓ చిన్నారి మృతి చెందింది. మరో 50 మంది ఆసుపత్రి పాలయ్యారు. మంత్రాలయానికి 20 కి.మీ. దూరంలో ఉండే సుంకేశ్వరి గ్రామంలో మూడు వేల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు బోర్ల నుంచి ట్యాంకులకు నీరు సరఫరా చేస్తున్నారు. కలుషిత నీరు తాగి ఈనెల 12వ తేదీ నుంచి గ్రామస్తులు వాంతులు విరేచనాలతో బాధపడుతున్నారు. కొంత మంది ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లగా.. మరికొంతమంది ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయించారు. మూడు రోజుల నుంచి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో 30 మందికి పైగానే చికిత్స పొందుతున్నారు. కొంతమంది ఆస్పత్రిలో ఉండగా... మరికొంతమంది చికిత్స చేయించుకొని గ్రామాలకు చేరుకున్నారు. గ్రామంలో దాదాపు 50 మందికి పైగానే వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రులకు వెళ్లినా ప్రభుత్వం స్పందించలేదు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన బోయ ఈరన్న, అంజలి కుమార్తె జ్యోతి (4) వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురవడంతో వెంటనే తండ్రి బంధువుల బైక్‌పై బాలికను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. అనుకోని సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారి మృతితో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోని నీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేయలేదు. అంతేగాక గ్రామంలోని తాగునీటి కుళాయి పైపులు లీకులు ఉండటంతో డ్రెయినేజీ నీరు అందులోకి వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో గ్రామస్తులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కాగా.. చిన్నారి మృతి విషయం తెలుసుకున్న వైద్యాధికారి సురేష్ సోమవారం గ్రామంలో చికిత్సలు ప్రారంభించారు. గ్రామంలో కలుషిత నీరు తాగడంతో అతిసార వ్యాధి ప్రబలినట్లు వైద్యాధికారి స్పష్టం చేశారు. బాలిక మృతితో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వరూపరాణి, టీడీపీ నేత రాఘవేంద్రరెడ్డి గ్రామానికి వచ్చి పరిస్థితి పరిశీలించారు.



ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుంకేశ్వరి గ్రామస్తులు



మురుగు చెంత మంచినీళ్లు పట్టుకుంటున్న దృశ్యం

ప్రభుత్వం స్పందించాలి



గ్రామంలో ఎక్కడా శుభ్రత లేదు. తాగేనీళ్లు పట్టుకునే ప్రతి చోటా మురుగు ఉంది. గ్రామంలో చాలా మంది వ్యాధి బారిన పడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చిన్నారి మృత్యువాత పడింది. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి. – గీత, గ్రామస్తురాలు

భయం వేస్తోంది



గ్రామంలో కలుషిత నీరు తాగి 50 మందికి పైగా వాంతులు విరేచనాలతో బాధ పడుతున్నారు. ఓ చిన్నారి ప్రాణం కూడా గాలిలో కలిసిపోయింది. చిన్న పిల్లలకు అతిసార సోకడంతో భయం వేస్తోంది. ఇప్పటికైనా గ్రామంలో శుభ్రత చర్యలు చేపట్టి, చికిత్సలు అందించి, ప్రాణాలు కాపాడాలి. – ఇందు, సుంకేశ్వరి

క్లుప్తంగా

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



స్వామివారి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు

మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు శరభయ్యశర్మ, తదితరులు అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

30 టన్నుల ఇసుక సీజ్

కర్నూలు (టౌన్): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. కోసిగి మండలం శాతనూరు గ్రామంలో అనుమతులు లేకుండా హిటాచి ద్వారా పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం రెవెన్యూ, సెబ్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అక్రమంగా నిల్వ చేసిన 30 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. అలాగే హిటాచి వాహనాన్ని కోసిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. అక్రమంగా ఇసుకను నిల్వ చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా స్విమ్మర్ల ప్రతిభ





దేవ్‌శృత్ సాయి, వెర్షిక

కర్నూలు కల్చరల్: కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో జిల్లా స్విమ్మర్లు సత్తా చాటారు. కర్నూలు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన 9వ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలుకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి వై.దేవ్‌శృత్‌సాయి గ్రూప్ -1 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 400 మీటర్ల ఇండివ్యువల్ మిడ్లే ఈవెంట్లలో ద్వితీయ స్థానంలో నిలిచి మూడు వెండి పతకాలు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్, 200 మీటర్ల ఇండివ్యువల్ మిడ్లే ఈవెంట్లలో తృతీయ స్థానంలో నిలిచి రెండు కాంస్య పతకాలు సాధించారు. అదేవిధంగా నగరంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని టి.వెర్షిక గ్రూప్ -3 విభాగంలో 50 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, 100 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించి సత్తా చాటింది. మెడల్స్ సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ భూపతిరావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు అభినందించారు.

గరుడ వాహనంపై ప్రహ్లాదవరదుడు

- ఘనంగా నృసింహ జయంతి మహోత్సవం
- స్వామివారి నిజరూప దర్శనంతో భక్తుల తన్మయత్వం



ఉత్సవమూర్తులను జ్యేష్ఠాభిషేకాలకు ముస్తాబు చేస్తున్న అర్చకులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో సోమవారం శ్రీలక్ష్మి నృసింహస్వామి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే దిగువ అహోబిలంలో వెలసిన మూలమూర్తులు ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లీ అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్య పూజలతో పాటు స్వాతి నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వైభవంగా పెరియశ్వార్ తిరునక్షత్రోత్సవం

స్వామి జయంతిని పురస్కరించుకుని పెరియాళ్వార్ తిరునక్షత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదవరద స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై అధిష్టించగా మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

శాస్త్రోక్తంగా జ్యేష్ఠాభిషేకం (అభిధ్యేయక అభిషేకం)

దిగువ అహోబిలంలో జ్యేష్ఠాభిషేకం (అభిధ్యేయక అభిషేకం) వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి వేద పండితుల వేదమంత్రోచ్ఛరణలతో 108 కలశాలతో కూడిన విశేష తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించి జ్యేష్ఠాభిషేకం పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి స్వయం తిరుమేనితో దర్శనమివ్వడంతో భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు.

జ్యేష్ఠాభిషేకం విశిష్టత

స్వామికి ఏటా జ్యేష్ఠ మాసంలో మూడు రోజుల పాటు జ్యేష్ఠాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. పురాతన కాలం నాటి ఉత్సవమూర్తులు నిరంతర అభిషేకాలతో అరుగుదలకు లోనవుతాయి. వాటిని పరిరక్షించేందుకు బంగారు కవచాలు తొడుగుతారు. కవచాల మీదుగానే నిత్యాభిషేకాలు నిర్వహిస్తారు. ఏడాదికి ఒకసారి ఆ కవచాలను తొలగించి విగ్రహాలను శుభ్రం చేస్తారు. దీంతో స్వామివారు స్వయం తిరుమేని (నిజరూప దర్శనం)తో భక్తులకు దర్శనమిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రోజుకో కవచం ధరింపజేస్తారు. మొదటి రోజు ముత్యాల కవచంతో అలంకరించారు. రెండో రోజు వజ్రకవచం ధరింపజేస్తారు. మూడవరోజు వజ్ర కవచం తీసి స్వర్ణ కవచం ధరింపచేస్తారు. మళ్లీ జ్యేష్ఠాభిషేకం వరకు స్వర్ణ కవచంలోనే స్వామివారు దర్శనమిస్తారు. ఈ పూజలు మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజ యంత్రీంద్ర మహాదేశికన్, ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న ఎస్‌పీఎఫ్ డీజీ



ఎస్‌పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసు డైరెక్టర్ జనరల్ సి.ఎం.త్రివిక్రమ వర్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన డీజీ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. డీజీ దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో డీజీ దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీదారులకు అధికారులు ఇచ్చిన ఎండార్స్‌మెంట్లు మొక్కుబడి రీతిలో ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. సమస్యకు కచ్చితమైన పరిష్కారం చూపడం లేదా పరిష్కరించకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ అర్థమయ్యే రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. రీఓపెన్ అయ్యే దరఖాస్తులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. క్షేత్ర స్థాయి విచారణకు సంబంధించిన ఫొటోలు అప్లోడ్ చేసే దాఖలాలే కనబడటం లేదన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 7, రెవెన్యూలో 5, ల్యాండ్ అండ్ సర్వేలో 2, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్నాయని వీటన్నింటినీ క్లియర్ చేయాలని ఆదేశించారు. సచివాలయ సర్వీసులకు సంబంధించి సివిల్ సప్లయ్స్, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలకు సంబంధించిన సమస్యలను ఎంపీడీఓలు విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన పిటిషన్‌లే అధికంగా ఉన్నాయని, మండల, డివిజన్ స్థాయిలో రెవెన్యూ అధికారులు చురుగ్గా పనిచేయాలని, వచ్చే వారం నుంచి రెవెన్యూ శాఖకు వచ్చే దరఖాస్తులు తగ్గుముఖం పట్టాలని సూచించారు. పరిష్కార వేదిక కార్యక్రమంలో 161 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతులు అందించారని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని ఇన్‌చార్జ్ కలెక్టర్/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఇన్‌చార్జ్ కలెక్టర్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా సదరం సర్టిఫికెట్లు, భూ వివాదాల సమస్యలపై అర్జీలు వస్తుండడంతో సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలని, నిబంధనల మేరకు పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- కర్నూలు నగరానికి సమీపంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుధాకరప్ప, నరసింహులు వినతిపత్రం ఇచ్చారు.

పొలం రాయించుకొని గెంటేశాడు

ప్రస్తుతం నా వయసు 80 ఏళ్లకుపైగానే ఉంటుంది. భర్త నీలకంఠేశ్వరుడు 23 ఏళ్ల క్రితం చనిపోయాడు. నా భర్త నుంచి వచ్చిన 13.85 ఎకరాల ఆస్తిని చిన్న కుమారుడు సురేష్ మోసం చేసి రాయించుకున్నాడు. ఈన్నాళ్లు నా పోషణను నేనే చూసుకునేదానిని. అప్పుడు ఏమీ చేతకావడం లేదు. ఆకలితో అలమటిస్తున్నా కుమారుడు పట్టించుకోవడంలేదు. పొలాన్ని నాకే ఇప్పించి న్యాయం చేయాలి.

– చెన్నమ్మ, ఏరూరు, చిప్పగిరి మండలం

నా పొలాన్ని నాశనం చేస్తున్నారు

నాకు రెండు కాళ్లు లేవు. వారసత్వంగా వచ్చిన 9.72 ఎకరాల్లో పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాను. గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి దౌర్జన్యంగా నా పొలంలో వెళ్తూ పంటను నాశనం చేస్తున్నాడు. పొలంలో వెళ్లొద్దని చెబితే దాడికి తెగబడుతున్నాడు. ఈ విషయంపై గూడూరు ఎస్ఐ, ఏఎస్ఐ, ఎమ్మార్వోల దృష్టికి తీసుకెళితే పట్టించుకోవడంలేదు. ప్రత్యర్థులపై కేసు పెట్టడం లేదు. నాకు న్యాయం చేయాలి.

– ఉప్పర చంద్రమోహన్, గూడూరు

చినుకులకే పరిమితం

కర్నూలు(అగ్రికల్చర్): ఆకాశం రోజూ మేఘావృతం అవుతున్నా వర్షం చినుకులకే పరిమితం అవుతోంది. ఒకటి, రెండు మండలాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నా మిగిలిన ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వానలు పడినప్పటికీ జల్లులకే పరిమితమైంది. జిల్లా మొత్తం మీద సగటున 4.2 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 22.9 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. అంటే 75 శాతం లోటు వర్షపాతం ఉంది. నెలలో పక్షం రోజులు గడిచినప్పటికీ వర్షాలు అంతంతమాత్రానికే పరిమితం కావడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్ మొదలై 45 రోజులు గడిచినా అత్తెసరు వర్షాలతో సాగులో పురోగతి కరువైంది.

మండలం	వర్షపాతం (మి.మీ)
కోసిగి	16.6
మంత్రాలయం	7.2
కౌతాలం	6.0
పెద్దకడుబూరు	5.4
ఎమ్మిగనూరు	5.2
కల్లూరు	5.2
పత్తికొండ	5.2

గుండమ్మ హత్యకేసు నిందితుల అరెస్ట్

- ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు : డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో ఈనెల 12వ తేదీన మాదిగ గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన కేసులో నిందితులు అదే గ్రామానికి చెందిన జడ్ల శ్రీధర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హెబ్బటం రామకృష్ణ, దాసరి గోవిందరాజును సిరుగుప్ప క్రాస్ రోడ్డులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈనెల 12న నాగనాథనహళ్లి గ్రామంలో రామచంద్రారెడ్డి అనే వ్యక్తి పొలంలో బండి రస్తా విషయంలో తగదా ఏర్పడగా మాదిగ గుండమ్మ (49)ను నిందితులు ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారన్నారు. అలాగే ఆమె సన్నిహితుడైన పురుషోత్తంరెడ్డిపై కర్రతో దాడి చేసినట్లు చెప్పారు. ఘటనపై గుండమ్మ కుమారుడు ఎస్.కిషోర్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామ రెవెన్యూ వివరాల ప్రకారం సదరు 4 ఎకరాల పొలాన్ని తిరుమలమ్మ, సోమశేఖర్‌రెడ్డి దంపతుల నుంచి మాదిగ గుండమ్మ 2019లో కొనుగోలు చేసిందన్నారు. 2022లో ఆమె కుమారుడు ఎస్.కిషోర్‌కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. ఈ భూమి విషయంలో గతంలో తిరుమలమ్మ, రాఘవేంద్రరెడ్డి అనే వ్యక్తి మధ్య వివాదం ఉండగా ఆదోని సివిల్ కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కొనుగోలు చేసిన నాటి నుంచి పొలాన్ని సాగుచేసుకుంటూ వస్తున్న గుండమ్మ ఈ నెల 12న కుమారుడు కిషోర్, కల్లుబావికి చెందిన పురుషోత్తంరెడ్డితో కలిసి పొలంలో ట్రాక్టర్‌తో ఉండగా నాగనాథనహళ్లికి చెందిన రాఘవేంద్రరెడ్డి, అతని కుమారుడు శ్రీధర్‌రెడ్డి, మరో నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌లో వచ్చి సదరు భూమిలో తమకు కూడా వాటా ఉందని, తాము కూడా దున్నుతామని గుండమ్మతో గొడవకు దిగారు. శ్రీధర్‌రెడ్డి ఆవేశంలో గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారని, రాఘవేంద్రరెడ్డి కర్రతో పురుషోత్తంరెడ్డిపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుల కోసం గాలింపు చేపట్టి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో సిరుగుప్ప క్రాస్ రోడ్డు వద్ద ఆరుగురిని అదుపులోకి తీసకున్నట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన ట్రాక్టర్, కర్రను సిరుగుప్ప క్రాస్ సమీపంలోని ముళ్ల పొదల్లో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు నిరంజన్‌రెడ్డి, మంజునాథ్, ఎస్ఐలు శ్రీనివాసులు, చిన్నపీరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

20 వరకే పత్తి సాగుకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి సాగుకు ఈ నెల 20 వరకు మాత్రమే అవకాశం ఉందని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త శివరామకృష్ణ తెలిపారు. పత్తి విత్తిన 10 రోజుల్లో మొలకలు రానిచోట విత్తనాలు నాటుకోవాలని, రెండు మొలకలు ఉన్నచోట ఒకటి పెరికివేయాలని, కుదురుగా ఒక మొక్క ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంటలో మొదటి 45 రోజుల నుంచి 60 రోజుల వరకు కలుపు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

- కలుపు నివారణకు విత్తనం వేసిన 24 నుంచి 48 గంటల్లోపు పెండిమిథాలిన్ 30 శాతం లేదా.. అలాకోర్ 50 శాతం 1.5 – 2.0 లీటర్లకు 200 లీటర్ల నీరు కలిపి నేలపై పిచికారీ చేయాలన్నారు.
- భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు పిచికారీ చేసినట్లయితే కలుపు మందు సమర్థవంతంగా పనిచేసి 20 రోజుల వరకు కలుపు మొక్కలు లేకుండా చేస్తుందన్నారు.
- పంట నెల రోజుల దశలో ఉన్నప్పుడు పొలంలో సన్న ఆకుల గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు క్విజలోఫాస్ ఇథైల్, 400 మి.లీ, లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ, లేదా పైరిథయోబ్యాక్ సోడియం 6 శాతం+ క్విజలో ఫాప్ ఇథైల్ 4 శాతం, ఎంఐసీ 500 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.
- ఎకరాకు 110 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేటు, లేదా 50 కిలోల డీఏపీ, 40 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌కలిపి 4 సార్లు వేసుకోవాలని తెలిపారు.
- భాస్వరం ఎరువు మొత్తాన్ని దుక్కిలో లేదా విత్తిన 15 రోజుల్లోపు వేసుకోవాలన్నారు.
- పత్తి వేసిన 20, 40, 60, 80 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి 4 సార్లు వేసుకోవాలి.
- పైపాటుగా డీఏపీ లేదా కాంప్లెక్స్ (20-20-0-13) ఎరువులను జూలై తర్వాత వాడరాదన్నారు.
- పత్తి పంట బెట్టకు లేదా అధిక వర్షాలకు గురైనప్పుడు పంట పెరుగుదలకు 19-19-19 లేదా 13-0-15 లాంటి పోషకాలను లీటరు నీటికి 10 గ్రాముల చొప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు.
- అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసిన రైతులు 45-50 రోజుల దశలో ఉన్నప్పుడు తప్పకుండా మెపిక్వాట్ క్లోరైడ్ మందును లీటరు నీటికి 1.2 మి.లీ ప్రకారం కలుపుకొని పిచికారీ చేసుకోవాలని తెలిపారు.
- పంట మొదటి 30-45 రోజుల్లో రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు, లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు.
- పత్తిలో మొక్కలు సామూహికంగా చనిపోతే వేరుకుళ్లుగా భావించి కార్బండాజిమ్ 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల చుట్టూ వేరు బాగా తడిచే విధంగా పోసకోవాలన్నారు.
- మరిన్ని వివరాలకు 89194 06382 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ తెలిపారు. 30 రోజుల శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు, చదవడం, రాయడం వచ్చిన యువకులు అర్హులని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 63044 91236 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- మద్యం అలవాటు మానుకుంటేనే కాపురానికి వస్తానని భార్య చెప్పడంతో అఘాయిత్యం

మహానంది: మద్యం మానేస్తేనే కాపురానికి వస్తానని భార్య తేల్చి చెప్పడంతో జీవితం విరక్తి చెంది వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బండిఆత్మకూరు మండలం జి.లింగాపురం గ్రామానికి కుంచపు గోకారి (46) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో బాధలు పడలేక భార్య శివలక్ష్మి మూడు నెలల క్రితం అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. భర్త కాపురానికి రమ్మని కోరగా మద్యం అలవాటు మానుకుంటేనే వస్తానని తేల్చిచెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త కుంచపు గోకారి సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడు గోకారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



